భూసార పరీక్ష.. పుడమికి రక్ష

- పరీక్షలతో నేల స్వభావంపై కచ్చితమైన అంచనా
- ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం
- భూసారం పెంపొందేందుకు చర్యలు
- తగ్గనున్న పంటల సాగు ఖర్చు
- అధిక దిగుబడులకు అవకాశం


భూసార పరీక్షలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఎర్రగుంట్ల : వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు. సాగు భూమిలో భూసార పరీక్షలు చేయించడం నేలలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార, స్థితి, చౌడు, ఇతర సమస్యలు తెలుస్తాయి. అలాగే ఏ ఎరువులు అనవసర వ్యయం, గణనీయంగా తగ్గుతుంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలను అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంత మంది అన్నదాతలు రసాయన ఎరువులు, పురుగుమందులు, అవసరానికి మించి వినియోగిస్తుండటంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడు బారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. పంటకోత పూరైన తర్వాత, వేసవి పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తర్వాత మట్టి నమూనాలు సేకరించకూడదు. పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపైన ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసి వేయాలి. వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపార నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి. వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో భాగ కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా ఆరిన తర్వాత పాలిథిన్ కరవ్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్ విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్ష కేంద్రాలకు పంపుతారు. వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతుతో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

భూసార పరీక్షలు ఎంతో మేలు..



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దాని అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. పంటలకు అవసరమైన పోషకాలను రసాయన రూపంలో కంటే సేంద్రియ జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

శ్రీకాంత్‌రెడ్డి (వ్యవసాయ అధికారి ఎర్రగుంట్ల మండలం)

క్లుప్తంగా

ప్రతి ఒక్కరి భద్రత లక్ష్యం


ఆర్టీపీపీలో మాక్ డ్రిల్‌లో సూచనలు ఇస్తున్న ఫైర్ సిబ్బంది

ఎర్రగుంట్ల : పరిశ్రమలలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ భద్రత నియమాలు పాటించాలని అందుకు మాక్ డ్రిల్ ఎంతోగానో ఉపయోగపడుతుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్రాక్టీస్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో భద్రతపై మాక్ డ్రిల్ చేశారు. తర్వాత ఆర్టీపీపీ సీఈ గౌరిపతి ఆధ్వర్యంలో భద్రత సిబ్బందికి ఆర్టీపీపీ అధికారులపై సమావేశం జరిగింది. కార్యక్రమంలో పరిపాలన అధికారి సోమశేఖర్‌రెడ్డి, సినియర్ ఎస్ఈ దేవేంద్ర నాయ్, ఫ్యాక్టరీ మేనేజర్ ఎన్.సిద్ధయ్య, ఎస్‌పీఎఫ్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న వెంకటసుబ్బయ్య, తదితరులు

వేంపల్లె : రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముద్దనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య(ఏడీఏ) హెచ్చరించారు. బుధవారం వేంపల్లె మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్‌తో కలిసి విత్తన దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయా దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాకు రిజిస్టర్, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు, స్టాకు బోర్డులు పరిశీలించారు. అలాగే ఏయే కంపెనీల ద్వారా వస్తున్నాయనే విషయాలపై ఆరాతీశారు. అంతేకాకుండా రైతులకు నకిలీ విత్తనాలను అమ్మరాదని కొనుగోలుపై విధిగా రసీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

సాయి లతీష్‌కు ఉత్తమ ర్యాంకులు



పులివెందుల : పులివెందుల పట్టణానికి చెందిన కానిస్టేబుల్ జగదీశ్వర య్య, టీచర్ శ్యామల దంపతుల కుమారుడు సాయిలతీష్‌కు ఎంసెట్, నీట్‌లలో ఉత్తమ ర్యాంకులు లభించా యి. ఈ సంవత్సరం 2024 జరిగిన ఎంసెట్‌లో 146వ ర్యాంకు, అలాగే నీట్‌లో 720 మార్కులకు గానూ 677 మార్కులు సాధించారు. సా యిలతీష్‌కు ఉత్తమ ర్యాంకులు రావడం పట్ల తల్లిదండ్రులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు. సాయిలతీష్ మాట్లాడుతూ అగ్రికల్చర్‌లో ఆసక్తి కలిగి ఉండటం వల్ల ఎంసెట్ రాసి 146వ ర్యాంకు సాధించానన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం చేయడం ద్వారా అందరికి మంచి ఆరోగ్యాన్ని అందించడమే తన అభిలాషని పేర్కొన్నారు.

మెగా డీఎస్సీపై చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి

జమ్మలమడుగు : రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం కూటమి ఇచ్చిన హామీమేరకు మెగా డీఎస్సీపై మొదటి సంతకం పెట్టి హామీలు అమలు పరచాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఆయన ఏర్పాటు చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే డీఎస్సీపై సంతకాలు చేస్తామన్నారు. కానీ ప్రమాణ స్వీకారం రోజున డీఎస్సీపై తొలి సంతకం పెట్టలేదు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. కాలయాపన చేసి నిరుద్యోగులను మోసం చేసే ప్రయత్నం చేస్తే చంద్రబాబుకు పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో పనులు చేయించడం నేరం

కడప కోటిరెడ్డిసర్కిల్: చిన్నారులతో దుకాణదారులు, ఇతర సంస్థల యాజమానులు పనులు చేయించడం చట్ట రీత్యా నేరంగా గుర్తించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ తెలిపారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాసాపేట పరిధిలోని ఆటో గ్యారేజ్, పెట్రోల్ బంకులు, దుకాణాలు ఇతర యజమానులను నిర్బంధిత కార్మికులరక్షణ, పునరావాసం అంశంపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ షాపులు, సంస్థల యాజమాన్యాలు వయస్సు ధృవీకరణ పత్రాలు తీసుకుని కార్మికులను నియమించుకోవాలన్నారు. అలాగే ఉచిత న్యాయ సహాయం అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, కార్మిక శాఖ అధికారులు మునిస్వామి, శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్, ఎల్‌పీఓ సునీత, పారా లీగల్ వలంటీర్లు శ్రీనివాసులు, విష్ణు, పోలీసులు, కార్మికులు పాల్గొన్నారు.

రైతు సేవలో వ్యవసాయ వర్శిటీ


విద్యార్థులతో అసోసియేట్ డీన్ రెడ్డిశేఖర్

పులివెందుల టౌన్ : వ్యవసాయ యూనివర్శిటీ 60వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం స్థానిక ఏపీకార్ల్‌లోని ఆచార్య ఎన్జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ రైతు సేవలో వర్శిటీ ద్వారా అధిక దిగుబడినిచ్చే వంగడాల ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల అధికారి డాక్టర్ విజయశంకర్‌బాబు, అకడమిక్ అధికారి డాక్టర్ హరిప్రసాద్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ రామలక్ష్మీదేవి, పరిపాలన అధికారిణి లీలావతి, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుకుళ్లు తెగులు నివారించండి


దుగ్గన్నగారిపల్లె వద్ద పత్తిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త శశికళ, వ్యవసాయ అధికారులు

వేముల : వేసవి పంటగా సాగుచేసిన పత్తి పంటలో వేరుకుళ్ల తెగులును నివారించుకోవాలని కృషివిజ్ఞాన కెవికే శాస్త్రవేత్త శశికళ తెలిపారు. మండలంలోని దుగ్గన్నగారిపల్లెలో సాగుచేసిన పత్తి పంటను వారు పరిశీలించి మాట్లాడారు. రుతుపవనాల ప్రభావంతో పత్తిపంటలో నీరు నిల్వడం వల్ల వేరుకుళ్ల తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు కాఫర్ యాక్సీ క్లోరైడ్ 1 లీటరు నీటికి 3 గ్రాములు కలిపి మొదలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. మెగ్నీషియం వంటి పోషక లోపాల నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ లీటరుకు 2 గ్రాములు, 13–0–45 మందును ఒక లీటరు నీటికి 10 గ్రాములు కలిపి వర్షం నిలిచిన తర్వాత పిచికారీ చేయాలన్నారు. అలాగే గులాబీరంగు పురుగు నివారణకు ముందు జాగ్రత్త చర్యగా పత్తిపంటలో ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు అమర్చడం ద్వారా మగపురుగులను ఆకర్షించడం ద్వారా నివారించవచ్చన్నారు. గులాబీరంగు పురుగు ఉధృతిని గమనిస్తే మొదటిదశలో ఒక లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనెను లేదా ప్రొపెనోపాస్ ఒక లీటరు నీటికి 2 మి.లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తి పంట చివరి దశలో 1, 2 సార్లు మాత్రమే సింథటిక్ ఫైరీ థ్రాయిడ్స్ మందులు అయిన సూపర్ మైత్రేన్ ఒక లీటరు నీటికి 1 మి.లీ, లేదా ఫ్లూ బెండమైడ్ ఒక ఎకరానికి 50 మి.లీ లేదా నోవాల్యురస్ ఒక ఎకరానికి 300 మీ.లీ కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీపీడీ పద్మలత, ఎఫ్టీసీ ఏఓ శివశైలజ, వేముల ఏఓ చెన్నారెడ్డి, రైతులు రామలింగారెడ్డి, పుల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టాల్లో పాలు పంచుకుంటాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


హాజరైన నాయకులు, కార్యకర్తలు

వీరపునాయునిపల్లె : మండలంలోని ప్రతి కార్యకర్త కష్టాల్లో పాలు పంచుకుంటానని కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వ్యవసాయక్షేత్రంలో బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశం నిరన్వహించి మాట్లాడారు. ఈనెల 4వ తేదీన వెలువడిన ఎన్నికల ఫలితాల్లో మన పార్టీ ఓటమికి గురైందని ఏ ఒక్కరు కూడా కుంగిపోవద్దని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయామే కాని ప్రజల సంక్షేమ కొరకు పోరాటాలు నిరంతరం కొనసాగుతాయన్నారు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా వెంటనే నాదృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యను పరిష్కరించేందుకు ముందుంటానని తెలిపారు. 24 గంటలు నా సెల్‌ఫోన్ ఆన్‌లోనే ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్త నేరుగా ఫోన్‌చేసి సమస్యను తెలుపవచ్చన్నారు. ఏ గ్రామంలోనైనా మన పార్టీ కార్యకర్తకు, నాయకుడికి సమస్య ఎదురైతే మనమందరమూ ఐకమత్యంగా పోరాటం చేయాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఏవైనా రావాల్సి ఉంటే అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి బిల్లులు అందేలా చేస్తానన్నారు. ఇటీవల అసైన్‌మెంటు కమిటీలో అమోదం పొందిన ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకం అందించేలా కృషి చేస్తామన్నారు. సర్వరాయ సాగర్ ద్వారా రైతుల పంటపొలాలకు ఇబ్బందులు కలుగకుండా నీరు విడుదల చేయించడంలో ప్రధాన పాత్ర సోషించడం జరుగుతందని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి, మండల పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు అండగా ఉంటాం

పెండ్లిమర్రి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేదని ఏ ఒక్కరూ అధైర్య పడవద్దని ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కడప నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పెండ్లిమర్రి మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలలో ఓటమి ఎదురు కావడంతో టీడీపీ దాడులకు తెగబడుతున్నదన్నారు. దాడులకు భయపడకుండా అందరూ కలిసికట్టుగా ఉండి ధైర్యంగా దాడులను ఎదుర్కోవాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పార్టీ నేను కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలు తిరిగి నిర్వహించాలి

కమలాపురం : నీట్ పరీక్షలను తిరిగి నిర్వహించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఓం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కమలాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

నీట్ ప్రశ్న ప త్రాన్ని లీక్ చేసి వైద్య విద్యార్థులతో బీజేపీ సర్కార్ చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలకు 23 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. యూజీ 2024 ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ వచ్చిందన్నారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు హర్యా నాకి చెందిన ఒకే ఎగ్జామ్ సెంటర్ వారు కావడం విశేషం అన్నారు. వారికి 720కి 720 మార్కులు రావడం వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉందన్నారు. దీని కారణంగా అర్హులైన విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానాలోని ఒక విద్యార్థిని 179 ప్రశ్నలకు అటెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయని, తద్వారా 636 మార్కులు రావాలని, అయితే ఆ విద్యార్థినికి 720 మార్కులు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఈ పరీక్షల నిర్వహణలో అనేక సందేహాలున్నాయని, వాటిని రద్దు చేసిన తిరిగి పరీక్షలు నిర్వహించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఏపీ ఈఏపీసెట్‌లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: జేఎన్‌టీయూ విడుదల చేసిన ఏపీఈఏపీ ఫలితాల్లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంజినీరింగ్ అండ్ అగ్రికల్చర్, ఫార్మసీ పోటీ పరీక్షలో ప్రతిభ చాటారు. బ్రింద 438వ ర్యాంకు, హాసిని 536, సుస్మిత 598, సారా ఖానమ్ 679, హితేష్‌రెడ్డి 868వ ర్యాంకులను సాధించారు. వారిని డీజీఎం రామ్మోహన్‌రెడ్డి, కోర్ డీన్ చంద్ర కిషోర్‌రెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణరెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్, తదితరులు అభినందించారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చర్మవ్యాధుల వైద్య నిపుణులు ప్రతి శుక్రవారం, నెలలో మొదటి ఆదివారం అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు లేకుండా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో సమస్యలను గుర్తించి ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. ఆవేశాలకు పోకుండా ఆలోచనతో పని చేసి మున్సిపల్ అభివృద్ధికి కావాల్సిన వాటిని సమకూర్చుకోవాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పులివెందుల మున్సిపాలిటీకి రూ.800 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని కూడా పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎంపీకి, ఎమ్మెల్యేకు అండగా నిలిచారన్నారు. అందుకోసం ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంకా 20 నెలలు కౌన్సిల్ పదవికాలం ఉందన్నారు. ఎలాంటి ప్రలోభాలకు పోకుండా సేవలందించాలన్నారు. మన నాయకుడు ఏ విధంగా కుప్పాన్ని అభివృద్ధి పథంలో నడిపించారో అదేవిధంగా నేడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పులివెందులను అభివృద్ధి చేస్తుందని ఆశిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు కూడా పులివెందుల అభివృద్ధికి ఎక్కడా అడ్డుపడకుండా అభివృద్ధి చేస్తే బాగుంటుందన్నారు. పులివెందులను రాజకీయపరంగా చూడకుండా అభివృద్ధి చేయాలన్నారు.

కౌన్సిలర్లు అధైర్యపడకుండా ప్రజల అవసరాలు తీర్చాలన్నారు. కౌన్సిలర్లకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ప్రతిపక్షమనేది మనకు కొత్తేమి కాదని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో తప్పకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. ఎటువంటి విబేధాలకు వెళ్లకుండా ప్రజాసేవ లక్ష్యంగా ప్రతివార్డు కౌన్సిలర్ పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా సూచనలు, సలహాలు అందించారు. అనంతరం అభివృద్ధి పనులపై కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజుల్లా, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించండి


బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకును రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు తెలిపారు. బుధవారం పాత గంగిరెడ్డి ఆసుపత్రి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకును తిరుపతి అసిస్టెంట్ జనరల్ మేనేజర్, తిరుపతి రీజియన్ హెడ్ అమర్నాథరెడ్డి, చీఫ్ మేనేజర్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ ప్రసాద్‌ల చేతుల మీదుగా వారు రిబ్బన్ కట్‌చేసి బ్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించి మరింత అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం ఏజీఎం మాట్లాడుతూ ఖాతాదారులకు జీరో బ్యాలెన్స్‌తో అకౌంట్ ఓపెన్ చేయడం జరుగుతుందని, నెట్ బ్యాంకింగ్ సౌకర్యాలు కలవని, అదేవిధంగా కారు రుణాలు, హోమ్ లోన్, గోల్డు లోను, ఇతర రుణాలను అతి తక్కువ వడ్డీతో ఖాతాదారులకు లభిస్తాయన్నారు. ఈ అవకాశాలను ప్రజలు, రైతులు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శంకర్, సిబ్బంది, వైఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, నీలకంఠారెడ్డి ఖాతాదారులు పాల్గొన్నారు.

జ్ఞానపీఠానికి గౌరవం తెచ్చిన కవి సినారె

కడప కల్చరల్: దేశ సాహిత్య రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠం పురస్కారానికి ప్రముఖ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి గౌరవం తెచ్చారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి వర్ధంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులతో కలిసి డాక్టర్ సి.నారాయణ రెడ్డి చిత్రపటానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణరెడ్డి విశ్వంభరం కావ్య రచనతో జ్ఞానపీఠ పురస్కారం పొందడమేగాక, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ తెలుగు సినీ పాటల రచయితగా ఆచార్య నారాయణరెడ్డికి గొప్ప పేరుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతకుంట శివారెడ్డి, రమేష్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికులపై ఉగ్రవాదుల చర్య అమానుషం


డీఆర్వోకు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ప్రతినిధులు

కడప కల్చరల్: జమ్ము కశ్మీర్‌లోని వైష్ణోదేవి ఆలయం నుంచి శివ్‌ఖోడికి వెళ్తున్న హిందూ భక్తుల బస్సుపై ఇస్లామిక్ జిహాదీ ఉగ్రవాదుల దాడి అమానుషమని వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామ మహేష్, జిల్లా సహ కార్యదర్శి చిక్కన్న అన్నారు. ఉగ్ర దాడిలో పది మంది ప్రాణాలు కోల్పోయినందున, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఆర్వోకు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆర్టికల్ 370ని తొలగించాక ప్రశాంత వాతావరణం ఏర్పడిందని, ఉగ్రవాదుల దుదుకు చర్యలు మాత్రం తగ్గలేదన్నారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ఈ సంఘటన దేశ సార్వభౌమాధికారానికి సవాలుగా నిలుస్తోందన్నారు. ఇలాంటి అంశాలను ప్రోత్సహించే అంతర్గత విదేశీ సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సహ కార్యదర్శి సురేంద్ర, భజరంగ్‌దళ్ సహ సంయోజక్ అమర్, హిందూ పరిరక్షణ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మంచి సేవలను అందించాలి


పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న అభిజిత్ సిన్హా

జమ్మలమడుగు : బ్రాంచ్‌కు వచ్చే వినియోగదారులకు మెరుగైన సేవలను అందించినప్పుడే ప్రజలు మన బ్యాంకుల్లో ఖాతాలను తెరుస్తారని పంజాబ్ నేషనల్ బ్యాంక్ డీజీఎం అభిజిత్ సిన్హా తెలిపారు. బుధవారం పట్టణంలోని తేరు రోడ్డులో 74వ శాఖ పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ దేశంలోనే రెండవ అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు. ఈ బ్రాంచ్‌లలో వ్యవసాయ, బంగారంపై రుణాలను ఇవ్వడంతోపాటు ఇంటికి సంబంధించిన లోన్లను తక్కువ వడ్డీకే ఇస్తామన్నారు. వినియోగదారులకు డిపాజిట్ బ్యాంకింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సోమశేఖర్, రమణ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి మహాభారత గ్రంథాలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల సుధారాణి బుధ వారం స్థానిక యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మహాభారత గ్రంథాలను అందజేశారు. తన భర్త రిటైర్డ్ జిల్లా జడ్జి బొక్కసం వెంకటరమణ స్మారకంగా తిరుమల–తిరుపతి దేవస్థానాలు ప్రచురించిన ఆంధ్ర మహా భారతం 18 పర్వాలను బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డికి ఆమె అందజేశారు. రామప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు. వైవీయూ వీసీ ఆచార్య చింతాసుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య పుస్తక దాతలను అభినందించారు. ఆకుల కిశోర్‌బాబు, మహతి, ఎం.నాగరాజు, డాక్టర్ సి.శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కడప కల్చరల్: జిల్లాకు చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఉన్నత చదువుల కోసం కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థికసాయం అందించింది. ఒంటిమిట్ట మండలం కొండమాచుపల్లెకు చెందిన పుత్తా శివహాసిని ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో 583 మార్కులు సాధించింది. తల్లి అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్ విద్య కోసం బాసట సంస్థను ఆశ్రయించింది. బాసట సభ్యులు వై.మంజులరెడ్డి, జయంతి ద్వారా హర్షితారెడ్డి, అఖిల్‌రెడ్డి రూ.25 వేల చెక్కును విద్యార్థికి అందజేశారు.

జిల్లాలో ఫాదర్ కంబ్లిష్ బహుముఖ సేవలు

కడప కల్చరల్: జిల్లాలో క్రైస్తవ పితామహుడిగా పేరుగాంచిన ఫాదర్ కంబ్లిష్ సేవలు అందించారని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మడగలం ప్రసాద్ అన్నారు. ఫాదర్ కంబ్లిష్ 55వ వర్ధంతి సందర్భంగా బుధవారం మరియాపురంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాదర్ కంబ్లిష్ మరియాపురం నిర్మాతగా, పేద బడుగులకు విద్య, వసతి, ఉపాధి తదితర సేవలందించారన్నారు. రాయలసీమ లాంటి కరవు ప్రాంతంలో పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అందించారన్నారు. కంబ్లీష్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ప్రజల ఆదరభిమానాలు పొందాలని సూచించారు.